# ఆరెకటికల సంక్షేమానికి కృషి చేస్తా..

## ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్తా:ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 19 ప్రభాతవార్త :** గతకొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆరెకటికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరెకటికల సమస్యలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. ఆరెకటికల సమస్యలపై ఎమ్మెల్యేకు రిప్రజంటేషన్ ఇస్తూ ఆర్థికంగా వెనుకబడిన వారిని, ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడి ద్వారా లోన్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆరెకటిక సంఘం నాయకులు మల్లేశం, ఖాజారామ్, శివరాములు, మహెందర్‌జీ, వెంకటేశ్వర్‌జీ, రవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఆరెకటిక సంఘం నాయకులు

మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# మన ఓటు మోడీ కోసమే..

- మళ్లీ మోడీనే ప్రధాని కావాలి
- బీజేపీ గెలుపు దేశానికి ఎంతో అవసరం
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ
- మహబూబ్‌నగర్‌లో పార్లమెంటరీ ముఖ్య నాయకులు సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 19, ప్రభాతవార్త :** మనం వేసే ప్రతి ఓటు మోడీ కోసమే అని, ఈసారి మళ్లీ మోడీనే ప్రధాని కావాలని బీజేపీజాతీయ ఉపాధ్యక్షురాలు,మహబూబ్‌నగర్‌అభ్యర్థి డీకేఅరుణ అన్నారు.మహబూబ్‌నగర్‌లోని కాళికాంబ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.గత పదేండ్లలో దేశం ఏస్థాయికి వెళ్లిందో ఒకసారి ప్రజలు గమనించాలన్నారు.ఆర్థిక వ్యవస్థలో 11వస్థానం ఉన్నదేశం నేడు 5వస్థానానికి తీసుకొచ్చిన గొప్ప నాయ కుడు మోడీ అని కొనియాడారు. 2047వరకు దేశాన్ని ప్రపంచంలో నెంబర్ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా మోడీ అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలో తానే గ్రూపులు కట్టే వ్యక్తిని కాదని ఎవరూ విమర్శించినా వారి విజ్ఞతకే వదిలేస్తానన్నారు. తాను పాలమూరు ప్రాజెక్టుల కోసం, ఇక్కడి అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, బీజేపీ గెలుపు దేశానికి ఎంతో అవసరమని ప్రతిఒక్కరూ బీజేపీకి ఓటువేసేలా క్షేత్ర స్థాయిలో కేంద్ర పథకాలను వివరించాలని, అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ రాంచందర్,మాజీ మంత్రిచిత్తరంజన్‌దాస్,సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ, పద్మజారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, పదాకులు శ్రీనివాసులు,శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

## ఇటుక బట్టీ కార్మికుల పిల్లల కోసం

# పని ప్రదేశంలో శిశు సంరక్షణ పాఠశాల

**వనపర్తి టౌన్ మార్చి 19 ప్రభాతవార్త :** ఇటుకలు పట్టుకోవడం అలవాటు చేసుకున్న వారి చిన్ని చేతులు మొదటిసారిగా స్లేట్‌లను పట్టుకున్నాయి.వారిలో చాలామంది ఇంతకు ముందు స్కూల్ డ్రెస్ వేసుకోలేదు లేదా సరైన స్కూల్‌కి వెళ్లలేదు.కాబట్టి,మంగళవారం రోజున వనపర్తి జిల్లా మెట్టుపల్లి గ్రామంలో ఒడిశాకు చెందిన ఇటుక బట్టీ కార్మికుల పిల్లల కోసం పని ప్రదేశంలో సంరక్షణ కేంద్రం వర్క్‌సైట్ పాఠశాలను ప్రారంభించినప్పుడు, వారు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.వారు వారి వయస్సును బట్టి కొత్తయూనిఫారాలు,స్లేట్లు లేదా నోటుబుక్‌లు,పాఠ్యపుస్తకాలు,పెన్సిళ్లు,పెన్నులు పొందారు. జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి,ఐపీఎస్,ఏడి ఎట్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జిఓ)జి.సురేష్,చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్(సిడిపిఓ)ఆధ్వర్యంలో 49 మంది వలస కూలీల పిల్లలను పాఠశాలలో చేర్పించి తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి.ఎయిడ్ ఎట్ యాక్షన్ మల్టీ-గ్రేడ్ టీచింగ్‌లో శిక్షణ పొందిన వాలంటీర్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేయునైనది వారు 3 నుండి 6 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు నర్సరీ నుండి 2వ తరగతి వరకు తరగతులు తీసుకోవడం ప్రారంభించారు.ఎన్‌జిఓ పాఠ్యపుస్తుకాలు,స్కూల్ బ్యాగులు బూట్లు యూనిఫామ్,పెన్సిల్లు నోట్ పుస్తకాలు, పలుకలు, పెన్నులు మొదగులనవి ఇవ్వనైనది,చైల్డ్ డిపార్ట్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణ చైతన్య వారి ఆధ్వర్యంలో పప్పు, బియ్యం, కోడిగుడ్లు బాలామృతం మొదలగు పోష్టికి ఆహారము ఇవ్వనైనది పాఠశాల పర్యవేక్షణ కూడా అందిస్తోంది.ఇట్టి కార్యక్రమంలో ఎన్జీఓస్,సిడిపిఓ సిబ్బంది వనపర్తి డిఎస్పి జె వేంకటేశ్వరరావు వనపర్తి సిఐ నాగభూషణం, ఆత్మకూరు సిఐ శివ కుమార్, ఎహెచ్‌టియు ఇన్చార్జి అంజద్,వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న, రామరాజు భరోసా సెంటర్ సిబ్బంది షీ టీం సిబ్బంది పాల్గొనడం జరిగినది.



వర్క్‌సైట్ పాఠశాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

# వడ్డీలేని రుణాలతో 650 సంఘాలకు లబ్ధి..

## 250 కోట్లు మంజూరు చేస్తూ జిఓ జారీ

**చిన్నచింతకుంట,మార్చి 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందించేందుకు ముందుకు వచ్చింది. మండలంలోని 830 స్వయం సహాయక సంఘాలకు గాను 650 స్వయం సహాయక సంఘాలు వడ్డిలేని రుణాలకు అర్హత కలిగి ఉన్నాయి. వడ్డిలేని రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 250 కోట్లు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసింది. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాలు సకాలంలో వాయిదాలు చెల్లించిన సంఘాలకు వడ్డిలేని రుణాలను అందిస్తుందని ఎపిఎం విష్ణుచారి తెలిపారు. ఈసారి స్వయం సహాయక సంఘాలలోని సభ్యులైన మహిళలకు ప్రమాద భీమా కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. మహిళా సంఘాలలో సభ్యత్వం కలిగి ఉన్న మహిళా సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షల వరకు భీమా అందించేందుకు ప్రభుత్వం జిఓ జారీ చేసిందని ఆమె తెలిపారు. ముఖ్యంగా ప్రమాదంలో మరణించిన మహిళపై తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఎఫ్ఐఆర్ కాపీ అందిస్తేనే భీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. వడ్డీలేని రుణాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో మండలంలోని మహిళా సంఘాల సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



మండల మహిళా సమాఖ్య భవనము

## పాలమూరు బరిలో..

# రెడ్డి బిడ్డలు..!

- పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న ప్రధాన పార్టీలు
- బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి డీకే అరుణ, చల్లా వంశీచంద్‌రెడ్డి,మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- గత పార్లమెంట్ బరిలోనూ వీరే అభ్యర్థులు
- ఎమ్మెల్సీ పోటీలో మన్నె జీవన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి
- హోరాహోరీ పోరులో గెలుపెవరిదో ?











**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 19, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ బరిలో నుంచి మూడు ప్రధాన పార్టీల నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే ఉండడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, బీఆర్ఎస్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో ఉన్నారు. అయితే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల బరిలోనూ ఆయా పార్టీల నుంచి అభ్యర్థులుగా వీరే ఉండడం గమనార్హం. గత మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె గెలుపొందగా డీకే అరుణ రెండో స్థానంలో, చల్లా వంశీచంద్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతం పెరగడం పార్టీకి కలిసివచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ బరిలోనూ కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌రెడ్డి ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి గత ఎన్నికల్లో అనూహ్యంగా వచ్చిన ప్రముఖ పారిశ్రామికత వేత్త మన్నె శ్రీనివాస్‌రెడ్డి పోటిలో నిలిచి గెలిచి చూపించారు. అయితే మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 4,11,402 ఓట్లతో విజయకేతనం ఎగురవేశారు. డీకే అరుణ గట్టిపోటి ఇచ్చినా రెండో స్థానానికి పరిమితమయ్యారు. ఈసారి కూడా సిట్టింగ్ ఎంపీ మన్నెకే టికెట్ కేటాయిస్తూ గులాబీ అధినేత నిర్ణయం తీసకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మొదట సిట్టింగ్‌లను మారుస్తామని చెప్పినా ఇతర కారణాల వల్ల మళ్లీ సిట్టింగ్‌కే కేటాయించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ స్థానాల్లో అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందినా డీకే అరుణ 33.88 శాతం ఓట్లు పొంది తన సత్తాచాటారు. అయితే డీకే అరుణకు సొంత ఇమేజ్‌తోపాటు పార్టీలోనూ ఆమెకు పేరుతోపాటు జనాల్లో పెద్దఎత్తున గుర్తింపు ఉండడంతో మరోసారి అధిష్టానం ఆమెకు టికెట్ కేటాయించింది. గతేడాదితో పోలిస్తే అన్ని నియోజకవర్గాల్లోనే బీజేపీ ఓటింగ్ శాతం పెరగడం, మోడీ మానియాతో ఈసారి గెలుపు తనదే అంటూ ముందుకుసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 3.72 శాతం ఓట్లు పోలవగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 11శాతం ఓట్లు పోలవడం బీజేపీ గొప్ప బలంగా చెప్పవచ్చు. ఇదిలా ఉండగా చల్లా వంశీచంద్‌రెడ్డికి 2019లో 1,93,631 ఓట్లు పోలయ్యాయి. అయితే పార్లమెంట్ పరిధిలోని 7అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఉండడంతో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు నల్లేరుమీద నడకలా చాలా సునాయసంగా గెలిచారు. ఇదే సీన్ ఇప్పుడు కాంగ్రెస్‌కు కలిసి వచ్చేలా తెలుస్తున్నది. ఇప్పుడు కూడా 7అసెంబ్లీ స్థానాలు జడ్చర్ల, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, దేవరకద్ర,మక్తల్, నారాయణపేట, కొడంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందడం చల్లా వంశీచంద్‌కు అనుకూలంగా మారనున్నది. ఈసారి కాంగ్రెస్, బీజేపీకి ఓటింగ్ శాతం పెరగడం బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం ఒక వైపు ఆయన పార్లమెంట్ ఎన్నకల్లో గెలుపు చాలెంజింగ్‌గా తీసుకోవడం, అదే విధంగా మరో వైపు బీజేపీకి ఓటింగ్ శాతం పెరగడం, మోడీ మానియా, రామ మందిరం నిర్మాణం లాంటి ఎన్నో విషయాల్లో బీజేపి కలిసి వచ్చేలా తెలుస్తున్నది. మూడు ప్రధాన పార్టీల నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే ఉండడంతో కొంత ఆ ఆసామాజిక వర్గంలో ఓట్లు చీలే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఈ హోరాహోరీ పార్లమెంట్ పోరులో గెలుపెవరదిదో చూడాలంటూ జూన్ 4వరకు వేచి ఉండాల్సిందే. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల విషయానికి వస్తే సంఖ్యాబలం బీఆర్ఎస్‌కు ఉన్నది. అయితే ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ ఉండడం, ఉమ్మడి పాలమూరులో 12అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందడం జీవన్‌రెడ్డికి కలివచ్చే అవకాశాలు ఉన్నాయి.




మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

# ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి..

## - పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంది - మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 19, ప్రభాతవార్త :** రానున్న పార్లమెంట్ ఎన్నికలు శాంతి యుతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్ర బలగాలు ఇప్పటికే జిల్లా చేరాయని, నిత్యం ఏరియా డామినేషన్ వెహికిల్ చెకింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారం నుంచే ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ చెక్‌మ పోస్టులను స్టార్ట్ చేస్తామని చెప్పారు. ప్రజలు ఎవరైనా రూ..50వేలకు మించి తరలించాలనుకుంటే తప్పనిసరి ఆధారాలు ఉండాలని సూచించారు. లేనియెడల్ డబ్బుకాని నగదు కానీ ఎన్నికల నిబంధనల మేరకు సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన మొత్తాన్ని గ్రీవెన్స్ సెల్‌కు పంపించడం జరుగుతుందన్నారు. సంబంధిత ఆధారాలు చూపించి గ్రీవెన్స్ సెల్ నుంచి నగదు కానీ, బంగారం కానీ పొందాలని సూచించారు. తెలంగాణలో పోర్త్ ఫేజ్‌లో సాధారణ ఎన్నికలు ఉంటాయి కాబట్టి ఎన్నికల కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

# అక్రమ వెంచర్‌లో రాళ్ల తొలగింపు...

## - అక్రమ వెంచర్లు చేపడితే చర్యలు తప్పవు.. - మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

**కల్వకుర్తి,మార్చి19 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపాలిటిలో అనుమతులు లేని అక్రమ వెంచర్లలో రాళ్లను తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కల్వకుర్తి మున్సిపాలిటిలో సర్వే నెం.746/ఈ/1లో అక్రమంగా చేసిన లేఅవుట్ లోని రాళ్లను ఆశ్రిత్‌కుమార్ దగ్గరుండి జేసీబీ సహాయంతో తొలగించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలో ఉన్న పలు లేఅవుట్లను పరిశీలించామని,అనుమతులులేని,అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ప్రజలు అనుమతులు లేని వెంచర్లలో, లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దన్నారు. కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ సెక్షన్ సిబ్బంది శ్రీధర్, శ్రీకాంత్, యాదగిరి, రామ్‌సాగర్‌లు తదితరులు ఉన్నారు.

**తూతూ మంత్రంగా రాళ్ల తొలగింపు...**

కల్వకుర్తి మున్సిపాలిటిలోని సర్వే నెం.746/ఈ/1లో 4 ఎకరాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా చేసిన వెంచర్‌పై గతంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే ముక్కుబడిగా రాళ్లను తొలగించారు. వెంచర్ తయారు చేసిన రియల్టర్లు తిరిగి యదావిధిగా ప్లాట్ల రాళ్లను పాతి క్రయ విక్రయాలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు రాళ్లను తొలగించిన రియల్టర్లు తిరిగి ఏ విధంగా వెంచర్‌లో ప్లాట్లను రాళ్లను పాతుతారని మున్సిపల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ వాసులు ఫిర్యాదులు చేయడం, అధికారులు తూతూ మంత్రంగా రాళ్లను తొలగించామని ప్రకటనలు చేయడం చేతులు దులుపుకోవడం యదావిధిగా చోటు చేసుకుంటుందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. అధికారుల అండదండలు లేకుండానే అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయా అని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. రాళ్లు తొలగించారు కానీ ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితేమిటని పలువురు చర్చించుకుంటున్నారు. పట్టణ కౌన్సిలర్లు, ప్రజల ఫిర్యాదుతో అక్రమ వెంచర్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించిన అధికారులు ఈ సారైన మళ్లీ రాళ్లు పెట్టనివ్వకుండా చర్యలు చేపడుతారా లేక రియల్టర్లు ఇచ్చే నయానో, బయానో పుచ్చుకొని వారికి వత్తాసు పలుకుతారో వేచి చూడాల్సిందే.



అక్రమ వెంచర్‌లో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

# వీధి కుక్కలను చంపిన కేసులో ముగ్గురి అరెస్టు..

## వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 19 ప్రభాతవార్త :** అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో వీధి కుక్కలను చంపిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ వెల్లడించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల గ్రామంలో మంద నరసింహారెడ్డి అత్తవారింట్లో ఉన్న డాష్ హ్యాండ్ పెంపుడు కుక్కలను వీధి కుక్కలు కరిచి ఒకదానిని చంపేయగా మరొకటి తీవ్రంగా గాయపడింది. దీంతో ఎ1 నిందితుడు మంద నరసింహారెడ్డి వీధికుక్కలపై కోపం పెంచుకుని వాటిని చంపాలనే ఉద్దేశంతో గత నెల 15వ తేదీ రాత్రి ఎ1 నరసింహారెడ్డి, ఎ2 తారిక్ అహ్మద్, ఎ3 మహ్మద్ తాహెర్‌లు టిఎస్ 11ఇఎఫ్ 7860 గల కారులో హైదరాబాద్ నుండి వచ్చి పొన్నకల్ గ్రామంలో గల అత్తవారింటికి వచ్చి రాత్రి 9.30 గం.లకు భోజనం ముగించుకుని అందరు పడుకున్నారని నిర్ణయించుకుని మధ్యరాత్రి ఒంటిగంట తర్వాత ఎ1 నరసింహారెడ్డి తన కారులో తన మిత్రుడై ఎ2 తారిక్ అహ్మద్ లైసెన్స్‌డ్ పాయింట్ 2 తుపాకీను తీసుకుని పొన్నకల్ గ్రామంలో రోడ్డు వెంబడి కనిపించిన వీధి కుక్కలను వెంబడించి దాదాపు 20 కుక్కలను తుపాకీతో కాల్చి చంపారు. అయితే మంగళవారం మధ్యాహ్నం పొన్నకల్ గ్రామంలో ముగ్గురు నిందితులు బెంజ్ కార్‌లో దావత్ చేసుకోవడానికి హైదరాబాద్ నుండి రాగా భూత్పూర్ సిఐ రామకృష్ణ, అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ సిబ్బందికి విశ్వసనీయ సమాచారం మేరకు పొన్నకల్ గ్రామంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి తుపాకీ ఆరు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా జరగాలి...

## అందుకు అందరూ సహకరించాలి:కలెక్టర్ సంతోష్





ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్.

**గద్వాల మార్చి 19 ప్రభాతవార్త :** సాధారణ లోకసభ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతతో పని చేయాలని వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి బి.ఎం సంతోష్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరములో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,స్టాటిస్టికల్ సర్విలేయన్స్,వీడియో వివింగ్ సర్వేలేన్స్,బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని అధికారులకు తెలిపారు.అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎమ్‌సిసి)నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్,సర్విలేయన్స్ టీం బాధ్యతలను తెలియజేశారు.జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా పెట్టి విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమంగా నగదు మద్యం రవాణాను అరికట్టాలన్నారు. ఏప్రిల్ 18 నుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు నిరంతరంగా టీములన్ని చురుకుగా పనిచేయాలన్నారు.సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే స్పందించి 100 నిమిషాలలో పరిష్కారించాలని సూచించారు.ఎన్నికల సమయంలో ఎవరైనా 50 వేలకు మించి నగదును తీసుకొని వెళ్తే కచ్చితంగా ఆధారాలు చూపించాలని,లేకుంటే అట్టి నగదును సీజ్ చేయడం జరుగుతుందన్నారు.10లక్షల వరకు స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కమిటీ ద్వారా పూర్తి ఆధారాలను పరిశీలించిన పిదప విడుదల చేయడం జరుగుతుందని,అంతకంటే ఎక్కువ ఉన్న నగదును ఇన్‌కంటాక్స్ అధికారుల పరిధిలోకి వెళుతుంన్నారు.నగదును స్వాధీనం చేసుకునేటప్పుడు ఖచ్చితంగా వీడియో కవరేజ్ చేయాలని సూచించారు.గతంలో జరిగిన లోపాలను సరి చేసుకుని పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించే విధంగా క్షేత్రస్థాయిలో సన్నద్ధమవ్వాలని,పార్లమెంట్ ఎన్నికలలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు.జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ రామ్ చందర్,డి.ఆర్.డి.ఓ నర్సింగ్ రావు,ఎఫ్‌యస్‌టి,యస్‌యస్‌టి,వియస్‌టి,వివిటి బృందాలు,సంబధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలి

**షేక్‌పల్లి, శాసనూలు గ్రామాలలో ఉపాధి పనులను పరిశీలించిన డిఆర్‌డిఎ, పిడి, ఎంపిడిఓ**



**ఇటిక్యాల, మార్చి 19 ప్రభాతవార్త :** వేసవిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు వందరోజుల పని దినాలు కల్పించాలని డిఆర్‌డిఎ పిడి నర్సింగ్‌రావు ఉపాధి శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని షేక్‌పల్లి, సాసనూల్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను జిల్లా డిఆర్‌డిఎ పిడి నర్సింగ్‌రావు మహ్మద్ ఆజార్ మొహియుద్దిన్, ఎపిఓ శివజ్యోతితో కలసి ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ గ్రామాలలో వేసవిలో ఉపాధికూలీలకు వంద రోజుల పరిధిలో కల్పించాలని పనులు ఉన్నచోట కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అలాగే కూలీలకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఫత్తేపూర్ మైసమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 19 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మండలం ఫత్తేపూర్ మైసమ్మ దేవాలయంలో మంగళవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వాదము ఇచ్చి అమ్మవారి శేష వస్త్రంతో పాటుగా అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కృష్ణయ్య, ఇఓ మదనేశ్వం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బి.రాఘవేందర్, ఎం. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకునేదే సీఎం ఫండ్ ఎల్వోసి..

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి**



**కొత్తకోట మార్చి 19 ప్రభాతవార్త :** ఆపద వచ్చినప్పుడు వెంటనే ఆదుకునేదే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చే ఎల్వోసి అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట మండలం వడ్డేపేట గ్రామానికి చెందిన జె.సురేష్, వైద్యం నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా, వారి వైద్యం కోసం సీఎం సహాయ నిధి ద్వారా 1,80,000 రూపాయల ఎల్వోసిని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో ఎవరికి ఏది జరిగిన నా వంతుగా తప్పకుండా సహకరిస్తానని అన్నారు. అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులతో మాట్లాడతానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రచాల యుగేందర్ గౌడ్, యువ న్యాయవాది మునగారి కృష్ణ, మన్యం, బాల్‌రాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి సమస్యను తీర్చండి...

**బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గోపాలపేట ఎంపీడీఓ కు వినతి...**



**గోపాలపేట మార్చి 19 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని, చెరువులు, కుంటలు ఎండిపోయాయని, త్రాగడానికి నీళ్లు లేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని మంగళవారం గోపాలపేట మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శంకర్ సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. రాబోయే ఈ ఎండకాలంలో సాధ్యమైనంత వరకు గ్రామాల్లో ఎక్కడైతే ఇబ్బంది ఉందో అక్కడ బోర్లు వేయించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరడమైనది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకులు యస్.శ్రావణ్ కుమార్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు వడ్డెమాన్ రవి. మండల పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, రాజేష్ చారి, లాలు నాయక్, పులెందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ వర్కర్లకు న్యాయం చేయండి..



**మక్తల్, మార్చి19 ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసేలా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మన మిషన్ భగీరథలో పనిచేస్తున్న 16వేల మంది కార్మికుల గురించి మాట్లాడడం జరిగింది. హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేలా చూడాలని కోరారు. దానికి మన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందిస్తూ మిమ్మల్ని అందరిని ఈ వారంలో సీతక్కను కలిసి వచ్చే వారం సీఎంను కలిసేలా చేస్తానని రాష్ట్రం మొత్తం అన్ని జిల్లాల నుండి దాదాపు 150 నుండి 200 మంది హైదరాబాద్‌కు రావాలని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా సత్యసాయి మిషన్ భగీరథ మక్తల్ సెగ్మెంట్ ఆపరేటర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, లైన్‌మెన్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మహేష్, సత్యసాయి సెగ్మెంట్ మక్తల్ మిషన్ భగీరథ సూపర్‌వైజర్ ఉమాశంకర్‌లు పాల్గొన్నారు.

## కోదండ రామాలయంలో ఘనంగా సీతారాముల కళ్యాణం



**ఇటిక్యాల, మార్చి 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గల కోదండ రామాలయంలో స్వామివారి పునర్వసు జన్మనక్షత్రం పురస్కరించుకొని మంగళవారం ఘనంగా అర్చకులు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు దత్తుస్వామి, భువనచంద్ర, భానుమూర్తిల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలోనే సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురెంద్రరాజు తెలిపారు.

## ఎమ్మెల్సీ, చల్లా, ఎమ్మెల్యే విజయుడును కలిసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ఇటిక్యాల, మార్చి 19 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గానికి చెందిన రిటైర్డ్ మాజీ ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం సాయంత్రం కర్నూల్ పట్టణంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సోమవారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి కెసిఆర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన మాజీ ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎమ్మెల్సీ చల్లా వెంకటరామరెడ్డిని, అలాగే అలంపూర్ ఎమ్మెల్యే విజయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించారు. అనంతరం అభిమానులు ముగ్గురిని గజమాలతో సత్కరించారు. వీరితోపాటు ఎంపి కేశవరావు, గద్వాలకు చెందిన రహమాన్, బోరవెల్లి మహేష్‌లు ఉన్నారు.

# కరువుకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్..

**ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు**



ఎండిన పంటను మేకలకు వదిలేసిన రైతు



ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

**కొత్తకోట మార్చి 19 ప్రభాతవార్త :** కరువుకు కేరాఫ్ అడ్రస్ ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ పార్టీ అని చెప్పడంలో సందేహం లేదని మదనాపురం మండలంలోని దంతనూర్ గ్రామంలో ఎండిన వరి పంటలను స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి జెడ్పిటీసి సభ్యులు కృష్ణయ్య యదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం మండలంలో ఖరీఫ్ 18000 వేల ఎకరాలు సాగయ్యేదాని గతంలో ఒక్క ఎకరా కూడా ఎండిపోయిన దాఖలాలు లేవని పెట్టుబడి సహాయం కింద రైతులకు సకాలంలో రైతు బంధు డబ్బులు జమయ్యేవని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రబీ సీజన్లో మండలంలో 8000 ఎకరాలు రైతులు సాగు చేస్తే దాదాపుగా 2000 నుండి 2500 ఎకరాలలో పంటలు కరెంటు, నీళ్లు, లేక ఎండిపోయాయని, ఇప్పటి వరకు రైతులకు రైతుబంధు డబ్బులు రాలేదని, జూరాల ప్రాజెక్టులో ఉన్న నీటిని ఈ మండల అధికార పార్టీ నాయకుల చేతగాని తనం వల్ల మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ కు నీటిని తీసుకెళుతున్నా, ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యే గాని, మండల అధికార పార్టీ నాయకులు గాని అడ్డుచెప్పలేదని మండిపడ్డారు. దతనూర్‌లో కౌలు రైతు బేరి గట్టన్న సాగుచేసిన వరి పంట ఎండిపోయి మేకలను మేపుతున్నాడని ప్రభుత్వం తగు నష్టపరిహారం ఇచ్చి రైతును ఆదుకొవలన్నారు. కరెంటు, నీళ్ల లేక సాగుచేసిన 2 ఎకరాలలో ఎకరన్నర పంట పూర్తిగా ఎండిపోయినందున పంటను మేకలకు వదిలేశాడని కౌలు డబ్బులు పెట్టుబడి దాదాపుగా 50 వేల రూపాయలు నష్టపోయాయని వాపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక మునుపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కరువు ఏ విధంగా ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు. రైతులు కరెంట్ కోసం మళ్ళీ బోరు బావుల దగ్గర పడుకునే దుస్థితి మళ్ళీ వచ్చిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి, పిఏసీఎస్ వైస్ ఛైర్మన్ చీర్ల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రావణ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రావణి, కురుమూర్తి, శివ శంకర్, ఆంజనేయులు, నెలివిడి తిరుపతయ్య, కోఆప్షన్ సభ్యులు చాందుపాషా, యూత్ అధ్యక్షుడు రాజకుమార్, దేశీ వెంకటేష్ యాదవ్, బాలకృష్ణ, విష్ణు, శాంతిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కార్యాలయంలో పోస్టులు భర్తీ చేయాలి నేతల వెల్లడి..



వనపర్తి జిల్లా లేబర్ అధికారిని తక్షణమే నియమించాలంటూ హైదరాబాదులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఆత్మకూర్, మార్చి 19, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలోని లేబర్ కార్యాలయంలో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవాని నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రోజు హైదరాబాదులోని రాష్ట్ర లేబర్ కార్యాలయంలో లేబర్ కమిషనర్ కృష్ణ ఆదిత్యను కలిసి వినతి పత్రం అందజేసినట్లుగా ఆయన వెల్లడించారు. వనపర్తి జిల్లా కేంద్రంగా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికి కార్మికుల సమస్యల పరిష్కరించడంలో లేబర్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కార్యాలయంలో సరిపడా లేబర్ కమిషనర్ ఇతర ఉద్యోగస్తులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులకు అందాల్సినటువంటి సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని ఆయన ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున బీడీ కార్మికులు పనిచేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి వనపర్తి జిల్లా కేంద్రంలోని లేబర్ కార్యాలయంలో లేబర్ ఆఫీసర్ తో పాటుగా ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు అన్వేష్ సాంబశివుడు దేవదానం తదితరులు ఉన్నట్లుగా ఆయన తెలిపారు.

## మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ ధర్నా..



మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న కాలనీవాసులు

**ఆత్మకూర్, మార్చి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని పదవ వార్డులో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ మంగళవారం రోజు పదవ వార్డుకు చెందిన కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గడిచిన 15 రోజులుగా కాలనీలో మంచినీటి సమస్య తలెత్తినప్పటికి అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు కాలనీలలో మంచినీటి సరఫరా నిర్విఘ్నంగా కొనసాగుతున్నప్పటికీ కేవలం పదవ వార్డులో మాత్రం మంచినీటి సమస్య పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూర్ మున్సిపల్ మేనేజర్ భూపాల్ కాలనీవాసులకు నచ్చ చెబుతూ వారం రోజుల్లోగా సమస్య పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కాలనీవాసులు శాంతించారు ధర్నా కార్యక్రమంలో కాలనీకి చెందిన పలువురు పాల్గొన్నారు.

## మల్కనీయంపల్లి గ్రామ మత్స్యకార సొసైటీ ఏకగ్రీవం..



కొత్త గ్రామ సొసైటీ సభ్యులతో ఎన్నికల అధికారి

**జల్లాఘనపురం మార్చి19 ప్రభాతవార్త:** మల్కినీయం పల్లి మత్స్యకార సంఘం గ్రామ సొసైటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పి రమేష్ బాబు తెలిపారు. కొత్తగా ఏర్పడిన మత్స్యారా సొసైటీ నోటిఫికేషన్ ఈ నెల 16న వేశామని మంగళవారం ఎన్నికలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సొసైటీ అధ్యక్షులుగా కే సాయులు, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, కార్యదర్శిగా బిక్షపతిని ఎన్నుకున్నారని, డైరెక్టర్లుగా కే వెంకటేష్, ఎదురు ఆంజనేయులు, కప్పేట బాలయ్య, కప్పేట నవీన్, కంప్యూటర్ శ్రీనివాస్, మద్దిలేటి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి సర్పంచ్‌ల ధర్నా..

**మక్తల్, మార్చి 19 ప్రభాతవార్త :** మండలంలోని 39 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు తమ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతబీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారులనిర్లక్ష్యంతో దాదాపురెండు నుంచి 3కోట్లరూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ తెలిపారు. చేసిన పనుల్ని ఇప్పటివరకు బిల్లులు రాకపోవడంపై తాము అప్పుల పాలు అయ్యామంటూ వాపోయారు. ఇప్పు దున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లిం చాలంటూ స్థానిక అధికారి ఎంపిడిఓకు వినతిపత్రం సమర్పించారు.



వినతి పత్రం అందజేస్తున్న తాజా మాజీ సర్పంచ్‌లు

## పోషకాహారంపై అవగాహన..



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మిడ్జిల్, మార్చి 19 ప్రభాతవార్త :** మండలంలోని వేముల మసిగుండ్లపల్లి గ్రామాల అంగన్‌వాడి సెంటర్‌లో పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమం సూపర్‌వైజర్ కల్పన నిర్వహించారు. అంగన్‌వాడి టీచర్లు స్వరూప, రాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కల్పన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడి సెంటర్ ద్వారా గర్భవతులకు, బాలింతలకు కిశోర బాలికలకు విద్యార్థులకు అందజేసే పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం అందజేసే మురుకులు, బాలామృతం, గుడ్లు వివిధ రకాల ఆహారాన్ని ప్రభుత్వం అందజేసే గ్రామాల్లో ఉండే పేద ప్రజల పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని అందులో భాగంగా అంగన్‌వాడి సెంటర్‌లో అందజేసే ముడి సరుకులను సద్వినియోగం చేసుకొని తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఆకు కూరలు, పండ్లు, కూర గాయలు ఎక్కువగా తీసుకోవాలని అన్నారు.

# వాహనాలకు షెడ్డు వేసి నీడ కల్పించండి..

**గద్వాల కలెక్టరేట్ ఆవరణ ఎండలో వాహనాలు... ఆవిరవుతున్న పెట్రోల్...ఆవేదనలో వాహనదారులు**



జోగులాంబ గద్వాల కలెక్టరేట్‌లో షెడ్లు లేక ఎండలో వాహనాలు

**గద్వాల మార్చి 19 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో వాహనాల పార్కింగ్ షెడ్లు లేకపోవడం వల్ల వాహనాలు వేడికి చెడిపోతున్నాయని వాహన దారులు మంగళవారం గద్వాలలో తెలిపారు. లక్షల రూపాయల పెట్టుబడి తెచ్చుకున్న ద్విచక్రవాహనాలు తీవ్రమైన ఎండలకు ఎండి, కలర్స్ పోయి, పెట్రోల్ ఆవిరి అయి అన్ని విదాల నష్టపోతున్నాయని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ల వాహనాలు కూడా ఎండకు ఉండడం వల్ల అవి కూడా చెడిపోతున్నాయని ఉద్యోగులు అంటున్నారు. అందుచేత వాహనాలు ఆపేందుకు చల్లని షెడ్లు, నిర్మించాలని ఉద్యగులు, ప్రజలు కోరుతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూతన కలెక్టర్ కార్యాలయం నిర్మించారు కానీ వాహనాలు నిలిపేందుకు షెడ్లు మాత్రం నిర్మించలేకపోయారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభాతవార్తకు స్పందన అధికారుల చర్యలు..



ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అధికారులు స్పందించి ఎన్నికల గుర్తును మూసివేసిన దృశ్యం

**ఆత్మకూర్, మార్చి19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఎన్నికల కోడ్ అమలు చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మంగళవారం రోజు ఎన్నికల కోడ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం పేరిట వార్త ప్రచురితం కావడంతో మంగళవారమే ఆత్మకూరు మున్సిపల్ అధికారులు స్పందించారు తక్షణమే పట్టణంలోని ఇందిరా గాంధీ కూడలిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎన్నికల జాతీయ గుర్తు హస్తం గుర్తు పై మూసివేయించారు.

## రెండవ రోజు ప్రశాంతంగా కొనసాగిన పదవ తరగతి పరీక్షలు..

**రెండు పరీక్షా కేంద్రాలలో ఇద్దర విద్యార్థులు గైర్హాజరు**

**ఇటిక్యాల, మార్చి 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇటిక్యాల, కొండేరు, ఎర్రవల్లి పదవ బెటాలియన్ కోదండపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో మంగళవారం రెండవరోజుజరిగిన హిందీపరీక్ష ప్రశాంతంగా ఎంఈఓ రాజు తెలిపారు. నాలుగు పరీక్ష కేంద్రాలలో 616 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా ఎర్రవల్లి పదవ బెటాలియన్ పరీక్ష కేంద్రంలో ఒక్క విద్యార్థి, మండలకేంద్రంలోని పరీక్ష కేంద్రంలో ఒక్క విద్యార్థి రెండవ రోజు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

## వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థికసహాయం



**కొత్తకోట మార్చి 19 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణంలోని ఎస్పీ కాలనీకి చెందిన పాపమ్మ(85)మృతి చెందగా విషయం తెలుసుకున్న జె.ఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కొమ్ము భరత్ భూషణ్, జెఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె.సతీష్ రాజు, నాయకులు భాస్కర్, చంద్రశేఖర్, వెంకటయ్య, మేస్త్రి రాజు, ప్రసాద్, శాంతిరాజు, ఆనందం, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**



**తెల్కపల్లి, మార్చి 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన పిట్ల ప్రశాంత్ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మరణించడంతో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో అతని మృతదేహాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యును ఓదార్చి రూ.10వేల ఆర్థికసహాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి ఈదుల నరెందర్‌రెడ్డి, నాయకులు మాధవరంహనుమంతరావు, బాబుగౌడ్ పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న డిసిసిబి ఛైర్మన్

**రాజాపూర్, మార్చి19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బంగారు మైసమ్మ అమ్మవారిని డిసిసిబి ఛైర్మన్ కోరమోని వెంకటయ్య దర్శించుకున్నారు. మంగళవారం డిసిసిబి ఛైర్మన్ కోరమోని వెంకటయ్య, కురువసంఘం జిల్లా అధ్యక్షులు సుధానర్సింలు, సింగిల్ విండో డైరెక్టర్ తక్కనపల్లి రాజు, మాజీ ఏఎంసి డైరెక్టర్ అల్లె తిరుపతయ్య, మాజీ ఉపసర్పంచ్ అల్లె శ్రీనివాస్‌లతో కలిసి దుందుభి వాగు సమీపంలోని బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎల్లయ్య, నారాయణ, యాదయ్య, నర్సింలు, మల్లయ్య, మణెమయ్య పాల్గొన్నారు.



## ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**మక్తల్, మార్చి 19 ప్రభాతవార్త:** నియజకవర్గం కేంద్రం ఆనంపల్లి వీధికి చెందిన విక్రమ్ గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విక్రమ్ ఆసుపత్రి వైద్య పరీక్షలు, ఆపరేషన్ నిమిత్తం నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 2,25,00 (రెండు లక్షల ఇరవై ఐదువేలు) ఎల్‌ఓసిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిఅందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కోళ్ళ వెంకటేష్, గాయత్రి అనిల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ మాసంలో విద్యార్థులకు సాయం



విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిళ్లు అందజేస్తున్న దృశ్యం

**మక్తల్, మార్చి 19 ప్రభాతవార్త:** రంజాన్‌మాసం నిరుపేదలకు సహాయం చేసే మాసంగా భావిస్తూ మక్తల్ బిసి కాలనీ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శంశుద్దీన్ తనవంతుసహాయంగా ఒక బ్యారల్ టబ్బును మక్తల్ వాసి ఎరుకలి మొగిలప్ప అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసికోళ్లవెంకటేష్, రహీంపటేల్, సలాం, బిసికాలనీ వాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**కొత్తకోట, మార్చి 19, ప్రభాతవార్త:** కొత్తకోట మండల ప్రధాన కార్యదర్శి అమ్మపల్లి బాలకృష్ణ, బిఆర్ఎస్ ఉద్యమ నాయకుడు శంకర్ యాదవ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ యాదయ్య సాగర్, గౌతమ్ రెడ్డితో పాటు మదనపురం మండలానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తకోట పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రోజు రోజుకు బిఆర్ఎస్ పార్టీ కొత్తకోట, మదపురం మండలాలలో బలహీనపడుతుంది. 10 సంవత్సరాలు పార్టీకి పని చేసి అధికారం కోల్పోయే సరికి బిఆర్ఎస్ ఇమడలేక అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పార్లమెంట్, ఎమ్మెల్యే ఉప ఎన్నికల నేపథ్యంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలో చేరే అవకాశాలు న్నాయి. కొత్తకోట మండలంలో బిఆర్ఎస్‌లో ఉన్న పెద్ద పెద్ద తలకాయలు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉండే సీనియర్ నాయకులు అడ్డుపడుతున్నట్లు తెలుస్తుంది. ఎన్నికలు ముగిసేవరకు ఎవరు ఏ పార్టీలో ఉంటారనేది వేచి చూడాలి.

## వాహనాల తనిఖీల్లో 90,300 రూపాయలు సీజ్



**వనపర్తి టౌన్, మార్చి 19, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పరిధిలో మంగళవారం వాహనాల తనిఖీల్లో భాగంగా మంగళవారం నాడు జిల్లా పరిధిలో వాహనాల తనిఖీలో పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నూల్ బైపాస్ రోడ్డు చెక్ పోస్ట్ దగ్గర వాహనల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి కర్నూలు నుండి వీపనగండ్లకు తన యొక్క కారులో నంబర్ ఎపి 31 ఎస్‌వి 7136 దానిలో 90,300/ రూపాయలు ఉండగా అట్టి రూపాయలకు ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున సీజ్ చేయడం జరిగినది. వనపర్తి జిల్లాలో మొత్తం 90,300/ రూపాయలు పట్టుబడినవి, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైన 50 వేల రూపాయల కొద్ది ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని ఒక వేళ తీసుకెళ్లే రసీదు, తగిన పత్రాలు వాటి వివరాలు ఉండాలని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లరాదని ఎస్పి తెలిపారు.

## సారా అమ్ముతున్న మహిళ పై కేసు నమోదు

**రేవల్లి, మార్చి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళ ˇవారం ఓ మహిళ అక్రమంగా నాటు సారా అమ్ముతున్న విష యం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి తనిఖీ చేసి మహిళ వద్ద నుండి నాలుగు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని మహిళ పై కేసు నమోదు చేశారు. ఇక పై ఎవరు సారా తయారు చేయడం గాని చేసిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకో బడునని ఎస్ఐ తిరుపతి రెడ్డి తెలిపారు.

## మాట ఇచ్చినం నిలబెట్టుకున్నం : జడ్చర్ల ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 19 ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారమే సేవాలాల్ మహరాజ్, మేరమ్మ యాడి గుడి నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. నవాబ్‌పేట మండలంలోని వెంకటేశ్వర తండాలో నూతనంగా నిర్మిస్తున్న సంతు శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్, మేరమ్మ యాడి గుడి భూమిపూజ కార్యక్రమానికి మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ గిరిజన తండాలఅభ్యున్నతి కోసంముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం గిరిజన మహిళలతో కలిసి సాంప్రదాయ నృత్యం చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధికార ప్రతినిధి జనుంపల్లి దుష్యంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్‌మార్చ్

**ఇటిక్యాల, మార్చి 19 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశానుసారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా మండల పరిధిలోని కొండేరు గ్రామంలో మంగళవారం సాయంత్రం కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్‌మార్చ్ ఎస్పై వెంకటేష్‌ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పై వెంకటేష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనకు తావు లేకుండా చేయడంలో భాగంగా జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు, ఫ్లాగ్‌మార్చ్ ద్వారా ప్రజలందరికి ఎన్నికల పట్ల భద్రత, భరోసా కల్పించడానికి ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమం నిర్వహించడంజరుగుతుందని ఎస్పై వెంకటేష్ తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించిఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికలలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ బలగాలు కలిసి విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు.

# కాంగ్రెస్ మ్యానిఫెస్టో మీటింగ్‌లో.. మనోళ్లు

- అత్యున్నత నిర్ణయాత్మక మండలిలో పాలమూరు బిడ్డలు
- పలు సూచనలు, సలహాలు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న చల్లా వంశీచంద్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 19, ప్రభాతవార్త:** లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్ సమాయత్తమవుతున్నది. ఇప్పటికే పాలమూరు జిల్లాలో పలు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ జనాలకు దగ్గరైన కాంగ్రెస్ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి కార్యచరణ రూపొందిస్తున్నారు. ఈక్రమంలో ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్లమెంట్ మ్యానిఫెస్టో సమావేశానికి తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరికి ఆహ్వానం అందగా అందులోఇదనదరు పాలమూరు బిడ్డలు ఉండడం విశేషం. రాష్ట్రానికి, వెనుకబడ్డ పాలమూరుకు సంబంధించి పలు అంశాలపై కూడా వివరించి వీరు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు సమాచారం.

**పాలమూరు అన్నదమ్ములు :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ఎన్నికల కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు తుదిమెరుగులు దిద్దే సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ప్రతి రాష్ట్రం నుంచి సీడబ్ల్యూసీ సభ్యులు ఇతర హోదాలో ఉన్న ప్రముఖులు హాజరయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరికి ఆహ్వానం లభించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఇద్దరూ కూడా కాంగ్రెస్‌అత్యున్నత నిర్ణయాత్మక మండలిలో తమఅభిప్రాయాలు వెల్లడించారు. రాష్ట్రానికి సంబంధించి, పాలమూరుకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు చేసినట్లు సమాచారం. ఇదే విషయమై అత్యున్నత సమావేశానికి అన్నదమ్ములు, పాలమూరు బిడ్డలు అంటూ సోషల్ మీడి యాలో పోస్టులు వైరల్ చేస్తున్నారు. అయితే మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిస్తే చల్లా వంశీచంద్‌రెడ్డికి ఉన్న కాంగ్రెస్‌లో ఉన్నఉన్నత స్థాయిపరిచయాలతో మరిన్నినిధులు సమకూర్చి, పాలమూరును అభివృద్ధి పథంలో నడిపిస్తారంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి

**పాలమూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి రుద్రసముద్రం రామలింగం**



మాట్లాడుతున్న పాలమూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి రుద్రసముద్రం రామలింగం

**మక్తల్, మార్చి 19 ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు తక్షణమే జాతీయ హోదా ప్రకటించాలని పాలమూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి రుద్రసుమద్రం రామలింగం డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఏ మాత్రం తెలంగాణపై ప్రేమ ఉంటే వెంటనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ హోదా ఇవ్వాలని ఆయన అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న ఏడునియోజకవర్గాల్లో ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సస్య శ్యామలం అవుతుందని అన్నారు. ఇప్పటివరకు భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చేసిన గొప్ప పనులు ఏంటని వారు ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నాటి స్వాతంత్రం నుండి నేటి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది అయినా కూడా ఇంకా వెనకబడి పోతూనే ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వెంటనేజాతీయ హోదా ప్రకటించి ఉమ్మడి పాలమూరు జిల్లాకు మంచి చేసే మార్గం చేయాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తమకు అనుకూలంగా మలుచుకొని పేద ప్రజలను మోసం చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి 100 రోజుల పరిపాలన దాటిన నేటి వరకు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని వెంటనే రైతుబంధు నిధులు రైతు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

# జిల్లా నోడల్ అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

- -ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు దిశా, నిర్దేశం
- -జిల్లాలో మొత్తం 22 నోడల్ అధికారుల నియామకం
- -నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 19 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని కలెక్టోరెట్ సమావేశ మందిరంలో జిల్లాలోని నోడల్ అధికారులతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని నోడల్ అధికారులు ప్రతి ఒక్కరు తమ విధులను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని, పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పి.ఉదయ్‌కుమార్ అన్నారు. జిల్లాలో మొత్తం 22 మంది నోడల్ అధికారులను నియమించామని, ఎన్నికల్లో నోడల్ అధికారులకు ఎంతో బాధ్యత ఉంటుందని, దీనిని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అలాగే నోడల్ అధికారులకు కేటాయించిన విధులపైన పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నోడల్ అధికారులకు కలెక్టర్ వారి విధులు, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. దీంతో పాటు ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతి ఒక్కరు వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉంటుందన్నారు. నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, గత ఎన్నికల్లో అనుభవాలను పరిగణలోకి తీసుకొని లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు, సలహాలు అందించారు. అధికారులకు శిక్షణ ఏర్పాటు చేయాలని, ఈవీఎం కమిషనింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, ఈవీఎం మేనేజ్‌మెంట్ రాండ్మైజేషన్ పోలింగ్ పర్సన్స్ డేటాఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సలహాలు, సూచనలు వివరించారు. ఎన్నికల్లో నగదు పట్టుబడితే పాటించాల్సిన నిబంధనలు గురించి అవగాహన కల్పించారు. సీ విజల్స్ వచ్చిన ఫిర్యాదులుపై ఎలా స్పందించాలో వివరాలు తెలియజేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఊపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు. ఎన్నికల సమయంలో చేపట్టాల్సిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్‌కుమార్, సీతారామారావు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌పై ఆర్టీసీ దాడి...

**-కబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్‌లో బస్టాండ్ ఆవరణలో గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ప్రెస్‌క్లబ్ కోసం గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు స్థలాన్ని కేటాయించారని, అట్టి స్థలంలో నిర్మాణంలో ఉన్న దుకాణాలపై మంగళవారం టీఎస్ ఆర్టీసీకి చెందిన డీఎం మరియు కొందరు ఉద్యోగులు దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తూ అందులో ఉన్న వారిని భయభ్రాంతులకు గురిచేశారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోని ప్రెస్‌క్లబ్‌కు రక్షణ కల్పించాలని స్థానిక జర్నలిస్టులు పోలీసులను ఆశ్రయించారు. గతంలో కబ్జాకు యత్నించిన వారి ఆగడాలను ఎండగట్టి నిర్మాణం చేపట్టిన జర్నలిస్టులకు ఆర్టీసీ అధికారులు, బెదిరింపులకు దిగుతున్నారని, ఇటీవల కబ్జాకు యత్నించిన సంఘటన మంగళవారంరాత పూర్వకంగా ఎస్ఐకి ఫిర్యాదు చేయడంతో ఇరువురిని పిలిచి మాట్లాడుదామని సూచించినప్పటికి ఆర్టీసీకి చెందిన ఉద్యోగులు దౌర్జన్యంగా జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కబ్జాకు యత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కందికొండ మోహన్, పి.వెంకటస్వామి, కంచర్ల శ్యాం, దస్తగిరి, బాబు, సహదేవుడు, సందు, యాదగిరి, రమేష్, భరత్, విజయ్‌భాస్కర్, శ్రీహర్ష, రాం ప్రకాష్ ఉన్నారు.

## అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

**బిజినేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** భార్య కాపురానికి రాకపోగా తిరిగి తనపై కోర్టులో కేసు పెట్టిందని అవమాన భారంతో వేముల చక్రవర్తి (32)ఉరేసుకొని ఆత్మహత్యకుపాల్పడ్డాడని ఎస్పై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగనూరు గ్రామానికి చెందిన వేముల చక్రవర్తి గంగారం గ్రామానికి చెందిన దేవితో 12 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మద్యం తాగి కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఏడాదిన్నర క్రితం భర్త వదిలేసి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో భర్తపై కోర్టు కేసు వేయడంతో అవమానభారంగా సొంత ఇంటికి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్పై తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై తెలిపారు.

### పట్టా భూమిని సీలింగ్ పట్టా నుండి తొలగించి న్యాయం చేయండి

**మహ్మదాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** పట్టా భూమిని సీలింగ్ పట్టా నుండి తొలగించారని మంగళవారం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన కొందరు రైతులు తహసిల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. మహ్మదాబాద్ మల్కచెరువు సమీపంలోని సేరి స్థలంకు సంబంధించినసర్వే నంబర్లకు చెందినవ్యవసాయ భూమిధరణి పోర్టల్ వచ్చినాక పట్టాభూమి, సీలింగ్‌పట్టాగా మారిందని, ఈభూమి మా అవసరానికి భూమి అమ్మాలన్నా, కొనుగోలు చేయాలన్నా అవకాశం లేకుండా పోయిందని, రైతులు, తహసిల్దార్‌కు విన్నవించుకున్నారు. ఈ భూమిని సీలింగ్‌పట్టానుంచి తొలగించిఎప్పటిలాగేసొంత పట్టా భూమిగా మార్చి మాకున్యాయం చేయాలనిరైతులు, తహసిల్దార్‌ను కోరారు. కావటిసత్తయ్య, దయ్యాల సత్తయ్య, చాకలి రాములు, చాకలి బుచ్చయ్య ఉన్నారు.

## మద్యం బాటిళ్ల పట్టివేత

**మాగనూరు, మార్చి 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎక్సైజ్‌శాఖ వారు పలు మద్యం షాపులను తనిఖీ చేయడం జరిగింది. మండల కేంద్రంలో తనిఖీ చేయగా, మాగనూరు (14 లీటర్లు), వర్కూరు ( 13 లీటర్లు), నేరడుగాం (13 లీటర్లు) మండిపల్లి (8 లీటర్లు) పలు బెల్ట్ షాపులపై రైడ్‌చేసి ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్పై అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

## మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గద్వాల్ బిఆర్ఎస్ కౌన్సిలర్లు



**గద్వాల ప్రతినిధి మార్చి 19 ప్రభాతవార్త:** మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో గద్వాలకు మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ ఆధ్వర్యంలో 17 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గత ఎన్నికల ముందు నుంచి గద్వాల పురపాలక సంఘం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు నాలుగు నెలల తరువాత ఎట్టకేలకు కాంగ్రెస్‌లో చేరిపోయారు. 17 మంది బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరికకు గత రెండు రోజుల రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందులో కొసమెరుపు ఏమిటంటే ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు 15 మంది బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్, ఇద్దరు బిజెపి కౌన్సిలర్లు మంత్రి సమక్షంలో చేరిపోయారు. చైర్మన్ బిఎస్ కేశవ్ 28వ వార్డు, 3వ వార్డు గిరిజబాయ్, 15వ వార్డు బంగి ప్రియాంక 16 వ సింగిరెడ్డి అనిత, 18వ వార్డు నరహరి గౌడ్, 20వ వార్డు మహేశ్వరి, 22వ వార్డు నాగరాజు, 25వ వార్డు మహేశ్ కుమార్, 26వ వార్డు కోరిలక్ష్మి, 32వ వార్డు కృష్ణ, 37వ వార్డు బుక్క శ్వేత, 24వ వార్డు శ్రీనివాసులు, 29వ వార్డు అరుణలు బిఆర్ఎస్ నుండి మంత్రి సమక్షంలో చేరారు.

**కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కౌన్సిలర్లు:** గద్వాల పట్టణ పురపాలికలో 17 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కశవ్ మున్సిపల్ చైర్మన్, జయమ్మ కోటిష్ 8వ వార్డు, అనిత శ్రీనివాస్‌రెడ్డి 16వ వార్డు, నరహరి గౌడ్ 18వ వార్డు, అరుణ జనార్దన్ 29వ వార్డు, కోరి లక్ష్మి నరసింహ 26వ వార్డు, గిరిజాబాయి జమన్ సింగ్ 12వ వార్డు, ప్రియాంక సుదర్శన్ 15వ వార్డు, శ్రీనివాసులు తెలుగు24వ వార్డు, మహేశ్ 25వ వార్డు, మాణిక్యమ్మ రామచంద్రుడు 1వ వార్డు, గీతమ్మ నాగులు యాదవ్ 3వ వార్డు, నాగరాజు 22వ వార్డు, శ్రీమన్నారాయణ 9 వ వార్డు, మహేశ్వరి సుధాకర్ 20వ వార్డు, బుక్క శ్వేత రంజిత్ 37వ వార్డు, వడ్డే క్రిష్ణ 32వ వార్డు,

**మిగిలిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు:** మురళి 27వ వార్డు, దౌలు 7వ వార్డు, లక్ష్మి నరసమ్మ 2వ వార్డు, నాగలత 6వ వార్డు, నాగిరెడ్డి 21వ వార్డు, నరహరి శ్రీనివాసులు 31వ వార్డు, బాబర్ 35వవార్డు, అలియా బేగం 10వ వార్డు

### ఉమాపతి ఆచార్యులకు పురోహిత రత్న అవార్డు ప్రధానం

**తెల్కపల్లి, మార్చి 19 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి మారోజు ఉమాపతి ఆచార్యులు వారి దంపతులకు పురోహిత రత్న బిరుదు ప్రధానం చేసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదులోని రవింద్ర భారతిలో అంతర్జాతీయ స్థాయిలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టిన శాంతికృష్ణ సేవా సమితిలో భాగంగా విశ్వబ్రాహ్మణ అర్చక పురోహితుల సన్మాన కార్యక్రమంలో భాగంగా పురోహిత రత్న బిరుదు ప్రదానం చేసి సన్మానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఖ్యాశాస్త్ర నిపుణులు, జ్యోతిష్యులు దైవాజ్ఞశర్మ, శాంతికృష్ణ సేవా సమితి అధ్యక్షులు వంగాల శాంతికృష్ణ ప్రముఖులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**బిజినేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లు కాట్రావత్ చందులాల్, పాండునాయక్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలునాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బిజినేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిద్దెరాములు, ఆదివాసి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వాల్యానాయక్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 19 ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలం గట్టునెల్లికూదురు గ్రామానికి చెందిన పిట్ల ప్రశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు ఈదుల నరేందర్‌రెడ్డి, నాయకులు మాధవరం హన్మంత్‌రావు, బాబుగౌడ్ తదితరులు ఉన్నారు.

## 21న ఉచిత కంటి వైద్య శిబిరం

**కల్వకుర్తిరూరల్ మార్చి19 ప్రభాతవార్త:** కల్వ కుర్తి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో గురు వారం ఉచితకంటి వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు పీఆర్ఓ పాష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కంటి వైద్య సహాయకులు బావండ్ల వెంకటేష్, వెంకటస్వామిలు కంటికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, శిబిరాన్ని వచ్చేవాళ్లు విధిగా ఆధార్‌కార్డు, రేషన్ కార్డులతో రావాలని, ఈ సదవకాశాన్ని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లోకి...



**కల్వకుర్తి, మార్చి 19 ప్రభాతవార్త:** బీఎస్పీ రాష్ట్ర చీఫ్‌గా వ్యవహరించిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఎస్పీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. కొమ్ము శ్రీనివాస్‌యాదవ్‌కు కేసీఆర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు.

## చిన్నారులపై వీధికుక్కల దాడి

**-ఒకే రోజు ఏడుగురు విద్యార్థులపై దాడులు చేసిన వీధికుక్కలు..**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటి పరిధిలోని ఎండబెట్లగ్రామంలో విద్యార్థులపై, చిన్నారులపై వీధి కుక్కలు దాడులు చేసి గాయపర్చాయి. మంగళవారం ఏడుగురు చిన్నారులపై వీధి కుక్కలు దాడులు చేసి గాయపర్చడంతో చిన్నా రుల తల్లిదం డ్రులు పిల్లలను జిల్లా ప్రభుత్వా సుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలి పారు. గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైందని మున్సిపల్ అధికారులకుఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సోమ, మంగళవారాల్లో కలిపి 10 మంది చిన్నా రులపై దాడులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న వీధి కుక్కలను తరిమివేయాలని కోరుతున్నారు.

## చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు రాజీనామా చేసిన గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్



**వనపర్తిటౌన్, మార్చి 19, ప్రభాతవార్త:** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశం మేరకు పార్టీలో చర్చించిన తర్వాత చైర్మెన్, వైస్ చైర్మన్ స్వచ్ఛందంగా వైదొలిగారు. ఈ సందర్భంగా చైర్మెన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 4 ఏండ్ల 4 మాసాలు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సహకారముతో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశామని అన్నారు. సహకరించిన పార్టీకి, కౌన్సిలర్లకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులుకురుమూర్తి యాదవ్, నందిమల్ల. అశోక్, గంధం. పరం జ్యోతి, సయ్యద్. జమీల్ కౌన్సిలర్స్ లక్ష్మినారాయణ, మహేష్, పాక నాటి. కృష్ణ, నాగన్నయాదవ్, బాషానాయక్, నాయకులు ఉంగ్లమ. తిరుమల్, ప్రేమనాథ్‌రెడ్డి, స్టార్. రహీమ్, ఎల్.ఐ.సి కృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

## పాత భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**మక్తల్, మార్చి19 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన పోస్టాఫీస్, తహసిల్దార్ పాత విశ్రాంతి భవనాలను స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న భవనాలను త్వరలో ప్రజలకు ఉపయోగంలోకి తీసుకొస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గణేష్‌కుమార్, మైనార్టీ మండల అధ్యక్షులు మహ్మద్ ఫయాజ్, కావలి రాజేందర్ పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

**బిజినేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త :** మత్తు పానీయాలు మానేయాలని భర్త మందలించడంతో పార్వతమ్మ (43) వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్పై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పోలేపల్లి, నేలగడ్డ తండాకు చెందిన పార్వతమ్మ మత్తు పానీయాలకు బానిస కావడంతో భర్త గోపాల్‌నాయక్ తరచూ మందలించినట్లు తెలిపారు. మంగళవారం తండావాసుల ముందు మందలించడంతో ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు సేవించింది. గమనించిన కుమారుడు నవీన్‌నాయక్ వెంటనే ప్రైవేట్ వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఇద్దరు కూతుళుల ఉన్నారు. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై తెలిపారు.

## కళ్యాణం కమనీయం

**బిజినేపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** పాలెం శ్రీ వెంకటేశ్వర ఆలయం గోవింద నామస్మరణతో మారుమోగింది. వెంకటేశ్వరస్వామి దివ్య కళ్యాణం కనులారా చూసేందుకు భక్తులు హాజరయ్యారు. గోవింద నామ స్మరణతో పాలెం మారుమోగింది. మంగళవారం శ్రీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీవారి కళ్యాణం ఉత్సవంలో తాడూరుకు చెందిన జటమోని శంకర్ కృష్ణవేణి దంపతులు కళ్యాణోత్సవ సేవలో పాల్గొన్నారు. స్వామి అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు మంత్రోచ్చరణ మధ్య స్వామివారి కళ్యాణ మహోత్సవంనిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో విశ్వక్సేనఆరాధన, పుణ్యావచనం, రక్షాబంధనం, యజ్ఞో పవీత ధారణ, మధుపర్కం, కన్యాదానం, మాంగళ్యధారణం, మాలమా ర్పిడి, తలంబ్రాలు, వారనం మయూరం, ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాల గోష్ఠి, వేద మంత్రోచరణాల మధ్య భాజా భజంత్రీలు, మంగళ వాయి ద్యాల మధ్య ప్రత్యేకంగానిర్వహించారు. మహ హారతితో కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం ప్రసాదం, శ్రీవారి కళ్యాణ తలంబ్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొరవి రామాజనుజాచార్యులు, జయంత్, శుక్ల, కార్యనిర్వహణాధికారి సిహెచ్ రంగారావు, ఆలయ సిబ్బంది బాబయ్య, స్వామివారి సేవకులు జగదీష్, వెంకటేష్, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

◆ అల్లాదుర్గం ఐబి వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి ◆ మండల సర్వ సభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


అల్లాదుర్గం ఐబి చౌరస్తా వద్ద బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలంటున్న ఎంపిపి అధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి

**అల్లాదుర్గం, మార్చి 19, ప్రభాతవార్త:** ఎండాకాలం సమీపించినందున గ్రామాల్లో ముందుస్తుగా తాగునీటి కొరత ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రజల గొంతులు ఎండుతున్నాయని మండల సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపిపి అధ్యక్షులు అనిల్ కుమార్‌రెడ్డి అధ్యక్షతననిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ మండలంలోని ముప్పారం తండా, అప్పాజిపల్లి తండా తదితర గ్రామాలకు మంచినీరు అందడం లేదని గ్రామస్థులు వాపోతున్నట్లు పేర్కొనగా సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు సరిగ్గా రావడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపినా ప్రయోజనం లేకుండాపోయిందని మిషన్ భగీరథ ఏఈ రాఘనాథ్ సమాధానం ఇచ్చారు. గ్రామాల్లోని చెరువుల నుంచి ఆయకట్టు భూములకు నీరుడు కులస్థులు సాగునీరు అందించేవారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నీరుడి గ్రామ సేవకులను విధుల నుంచి తొలగించడంతో చెరువుల నుంచి పంటపొలాలకు సాగునీరు అందించేవారు కరువయ్యారని సభ్యులు విచారం వ్యక్తం చేశారు. నీరుడు కులస్థులను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. అల్లాదుర్గం ఐబి చౌరస్తా వద్ద ప్రయాణీకులకు బస్‌షెల్టర్ లేక పడుతున్న పాట్లను ప్రభాతవార్త ప్రత్యేక కథనం ప్రచురించిన విషయాన్ని మండల సభ్యులు, అధికారులు ప్రత్యేకంగా చర్చించుకుని, వెంటనే ఆర్టీసి అధికారులు బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిపి అధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామినిధులతో గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపిటిసి సభ్యులను ఆహ్వానించకపోవడం సరికాదని ఎంపిటిసి సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీస్, ఎంపిడిఓ శంకర్, వైద్యాధికారి సారిక సయ్యద్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు కాశానీఫ్, ఆయా గ్రామాల ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


బోరంచ నల్లపోచమ్మ తల్లి ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## నల్లపోచమ్మ హుండీ ఆదాయం రూ. 7 లక్షలు 71 వేలు

**మనూర్, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో కొలువున్న నల్లపోచమ్మ తల్లి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఆలయంలో ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హుండీ ఆదాయాన్ని లెక్కించగా భక్తులు అమ్మవారికి మొక్కుబడిలో భాగంగా రూ. 7,71,618 సమర్పించుకున్నట్లు ఇఒ మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, అర్చకులు శ్రీకాంత్ స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

## బిజెపి మండల కమిటీ నియామకం


బిజెపి మండల కమిటీని ప్రకటిస్తున్న ఓంకార్ యాదవ్

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గాన్ని మంగళవారం మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ ప్రకటించారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా ఉషల్ రాములు, శ్రీకాంత్‌ముదిరాజ్, సతీస్‌గుప్తా, మధుసూదన్‌రెడ్డి గోపాల్, సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రాహుల్‌పాలింకార్, శ్రీకాంత్, మల్లేష్, భీమ్‌యాదవ్, కార్యదర్శులుగా శివకుమార్, కె.కృష్ణ, దౌలప్ప, అనిల్‌యాదవ్, సంతోష్‌పాటిల్, సంతోష్ రెడ్డి, నర్సింహా, కోశాధికారిగా నాగిరెడ్డి, అధికార ప్రతినిధిగా దిలీప్ యాదవ్, బీజెవైఎం మండల అధ్యక్షుడిగా వాసు మాడివల్, ఉపాధ్యక్షులుగా దినేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా కాశీనాథ్, ఉపాధ్యక్షులుగా పవన్ మహారాజ్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కమ్మరి సంగీత, మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా యండి సద్దాం, గిరిజన మోర్చా అధ్యక్షులుగా అరవింద్‌చౌహాన్, ఓబిసి మోర్చా అధ్యక్షులుగా అనిల్ ముదిరాజ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఉప్పరి మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా పండు, ఓనంరెడ్డి, ఏ రాములు, లావేష్ పాటిల్‌లను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షులు ఓంకార్ యాదవ్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు


వడ్డి గ్రామంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బిఆర్ఎస్, బిజెపి నాయకులు

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని వడ్డి గ్రామానికి చెందిన బిఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండంగారి తిరుపతిరెడ్డి తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేష్‌కుమార్ శెట్కార్‌ను భారీ మెజార్టీలో పార్లమెంట్ మెట్లు ఎక్కేలా ఆశీర్వదించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బల్‌రాంరెడ్డి, వడ్డి సునీల్ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న బిఆర్ఎస్ కార్యకర్తలు

**నారాయణఖేడ్, మార్చి 19 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పలు అభివృద్ధి పనులు చూసి ఆ పార్టీలో చేరుతున్నట్లు నారాయణఖేడ్ మండల పరిధిలోని సత్యగామ గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి నివాసంలో 250 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీ నుంచి కాం గ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పలు అభివృద్ధి పనులను చూసి బిఆర్ఎస్ పార్టీని విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, గోవింద్‌నాయక్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి దేవాలయ హుండీ లెక్కింపు

**గుమ్మడిదల, మార్చి19 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు మంగళవారం ఆలయ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వహణ అధికారి పి. శశిధర్, జిల్లా దేవాదాయ అధికారుల ఆదేశానుసారం రాజరాజేశ్వరి (కామా రెడ్డి) వారి బృందం చేత హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 13 లక్షల 12 వేల 268 రూపాయల హుండీ ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. అన్నదాన సత్రం ఆదాయం 70 వేల 55 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి శశిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆటేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నబోయిన వేణు, డి. కుమార్, యాదగిరి, మాజీ ధర్మకర్త లక్ష్మీనారాయణ, దేవాలయ అర్చకులు శివనాగులు, సిబ్బంది సోమయ్య, రవీంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం


వడగళ్లవానకి నష్టపోయిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

## మండలంలో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన
### అన్నదాతకు అపార నష్టం

**నిజాంపేట, మార్చి 19, ప్రభాతవార్త :** సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన వల్ల నిజాంపేట, బచ్చురాజ్‌పల్లి, నస్కల్, నందిగామ, కల్వకుంట్ల, నార్లాపూర్, చల్మెడ రెవెన్యూ గ్రామాలకు చెందిన మొక్కజొన్న, వరి పంట దెబ్బతిన్నది. నిజాంపేట మండల వ్యాప్తంగా 1329 ఎకరాల్లో వరి పంట, 206 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ, ఏవో టెక్నికల్ సతీష్ దెబ్బతిన్న వరి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారిని కావేరి రైతులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు
### 70 ఎకరాల్లో వరి....12 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నట్లు అంచనా

**రామాయంపేట, మార్చి 19, ప్రభాతవార్త :** సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన వల్ల రామాయంపేట మండలంలోని రాయలాపూర్, సుతార్‌పల్లి, శివాయిపల్లి, దొంగల ధర్మారం తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంట దెబ్బతిన్నది. రామాయంపేట మండల వ్యాప్తంగా 70 ఎకరాల్లో వరి పంట 12 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగినట్లు ప్రాథమిక అంచనా నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ రాయిలాపూర్ గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులతోపాటు వ్యవసాయ విస్తీర్ణాధికారిని స్రవంతి పాల్గొన్నారు.

## బీరప్ప ఆలయాభివృద్ధికి భూషణం ఆర్థిక సహాయం

**అల్లాదుర్గం, మార్చి 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలోని బీరప్పస్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతర మహోత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు దేవ భూషణం పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్దికి తన వంతుగా ఆలయానికి 10వేల రూపాయలను గొల్ల కురుమ సంఘం అధ్యక్షులు బీర్ల మొగులయ్య, ఉపాధ్యక్షులు హనుమయ్యలకు అందించారు. భూషణంకు సంఘం సభ్యులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిబాబా, డప్పు కిష్టయ్య, మున్నూరి కిష్టయ్య, గార్లపల్లి మల్లేశం, గొల్ల కురుమ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## దినెస్ట్ వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

**సంగారెడ్డి టౌన్, మార్చి 19, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్‌రావు సూచనల మేరకు మంగళవారం అమీన్‌పూర్‌లోని ది నెస్ట్ వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హనుమంతరావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హనుమంతరావు మాట్లాడుతూ వృద్దులపట్ల వివక్ష చూపరాదని సూచించారు. ఆశ్రమంలోని వృద్దుల యోగక్షేమా లపై న్యాయమూర్తి ఆరా తీశారు. ఆశ్రమ పరిసరాలను న్యాయమూర్తి పరిశీలించి చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్‌ను సంప్రదించాలని వృద్దులకు సూచించారు. కార్యక్రమంలో ది నెస్ట్ వృద్దాశ్రమ సిబ్బంది, వృద్దులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసీ అందజేసిన టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, మార్చి19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మానెపల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. కాగా ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీని టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మంగళవారం వారికి అందజేశారు. ఎల్‌వోసీని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పోతిరెడ్డి, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రఘునందన్‌రావును కలిసి దయాకర్‌గౌడ్

**కొల్చారం, మార్చి19 ప్రభాతవార్త:** బిజెపి మెదక్ లోకసభ అభ్యర్థి రఘునందన్‌రావును మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షులు పాతూరి దయాకర్ గౌడ్ మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.


రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దయాకర్‌గౌడ్


రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ దృశ్యం

## రైతులు లేని రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

**కొల్చారం, మార్చి 19 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమానికి రైతుల నుండి స్పందన కరువైంది. మంగళవారం కొల్చారం గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశం మంచిదే కాని.. క్రింది స్థాయి అధికారుల సమాచార లోపమో.. మరి ఏమో కానీ కొల్చారంలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు రైతులు కరువయ్యారు. కేవలం కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక్క రైతు కనిపించాడు. మిగితా వారంతా అధికారులే. ఇలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ రైతులకు ఉపయోగ పడేలా వ్యవసాయ అధికారులు చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యలక్ష్మీ భోజనాలు గర్భిణీలు తప్పకుండా తీసుకోవాలి


గర్భిణీలకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

**శివ్వంపేట, మార్చి 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మెదక్ డీడబ్ల్యూవో బ్రహ్మాజీ ఆదేశానుసారం పోషణ్ పక్వాడ్‌లో భాగంగా సీమంతాలు, అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, నర్సాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో హేమభార్గవిలు ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లులకు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి రోజు తినే ఆహారంలో చిరుధాన్యాలతో పాటు ఆకు కూరలు కలిపి తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మీ భోజనాలను గర్భిణీలు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, సీడీపీవో హేమభార్గవిలు మాట్లాడుతూ అన్నారు. అంగన్వాడీ టీచర్లు తయారు చేసిన ప్రీ స్కూల్ మెటీరియల్‌ను చూసి అభినందించారు. ప్రీ స్కూల్ మెటీరియల్ ద్వారా పిల్లలకు ప్రతి రోజు కార్యక్రమాలపై వివరించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ పాలసీ ద్వారా ప్రాథమిక విద్యాబోధన జరుగుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ సంతోష, టీచర్లు ఎం. నవీన, కృష్ణవేణి, హెల్పర్లు పాల్గొన్నారు. అనంతరం తిమ్మాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ ర్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసుమతి, టీచర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఫోటో7: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## పౌష్టికాహారంపై అవగాహన సదస్సు


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, మార్చి19 ప్రభాతవార్త:** అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ్ పౌష్టికాహారంపై చిన్నారుల తల్లిదండ్రులకు సీడీపీవో చంద్రకళ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ కవిత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ వీరన్నగూడెం అంగన్వాడీకేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ పౌష్టికాహారంపై ఈనెల 11 నుండి 23 వరకు నిర్వహిస్తున్నటువంటి పోషణ పక్వాడ్ పౌష్టికాహారంపట్ల చిన్నారుల తల్లి దండ్రులకు తక్కువ ఖర్చుతో పోషకవిలువలు ఎక్కువ ఉన్నటువంటి ఆహారం తినిపించాలని సూచించారు. ప్రతిఒక్కరి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని ఆకు కూరలు, పౌష్టికాహారం కలిగిన కూరగాయల మొక్కలను పెంపకం పెంచుకోవాలన్నారు. మన కుటుంబంలో కిచెన్ గార్డెన్ నుండి తాజా ఆకు కూరలు కూరగాయలు వస్తాయని, వాటి వల్ల ఎన్నో పోషక విలువలు కలిగి ఉన్న వంటకాలు చేసి చిన్నారులకు తినిపించాలని తెలిపారు. అనంతరం చిన్నారులకు అర్థమయ్యేరీతిలో వివిధరకాల బొమ్మలను తయారు చేసి వాటిని చూపిస్తూ టీచర్లు బోధించడం జరిగింది. కార్యక్రమంలో మండల అంగన్వాడీ టీచర్లు భూలక్ష్మీ, ప్రమీల, స్వప్న, సునీత, శైలజ, పోచమ్మ, సుజాత, వరలక్ష్మీ, సంగీత, నాగేశ్వరి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి రెండవ పరీక్ష

**కొల్చారం, మార్చి19 ప్రభాతవార్త:** మండలంలోని పరీక్ష కేంద్రాలలో మంగళవారం జరిగిన పదవ తరగతి రెండవ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాధికారి నీలకంఠం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన కొల్చారంలోని సెంటర్ ఏలో 192 మంది విద్యార్థులకు 192 మంది విద్యార్థులు, సెంటర్ బీలో 124 మంది విద్యార్థులకు 124 మంది విద్యార్థులు, రంగంపేటలోని సెంటర్ ఏలో 190 విద్యార్థులకు 190 విద్యార్థులు, సెంటర్ బీలో 80 మంది విద్యార్థులకు 80 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు వివరించారు. మొత్తం 586 మంది విద్యార్థులకుగాను 586 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు.

## గూడురులో పశువులకు గాలికుంట టీకాలు

**నాగల్‌గిద్ద, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని గూడుర్ గ్రామంలో మంగళవారం మూగ జీవాలకు గాలికుంట టీకాలువేశారు. గ్రామంలోని 168 పశువులకు గాలికుంట టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి నేతజీ, అసిస్టెంట్ లక్ష్మి ఆధ్వర్యంలో పశువులకు టీకాలువేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు సోకుండా ఉండేందుకు రైతులు విధిగా తమ పశువులకు గాలికుంట టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతులు ప్రయోజనం అందుకునే అవకాశాలు ఉంటాయని, అందుకు రైతులు తమ పశువులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మోడల్ స్కూల్‌కు న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్

**రామచంద్రాపురం, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని వెలిమెలలోని తెలంగాణ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని పేస్విఫ్ టెక్నాలజీస్ ఉద్యోగులు మంగళవారం తమ వంతు సహకారం అందించారు. పేస్విఫ్ టెక్నాలజీస్ ఉద్యోగులు సేకరించిన రూ. 36 వేలతో పాఠశాలలో టాయిలెట్‌లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయించినట్లు ప్రిన్సిపాల్ ఎ.రాంప్రసాద్ తెలిపారు. అలాగే విద్యార్థులకు చాక్లెట్‌లను అందించారన్నారు. పేస్విఫ్ టెక్నాలజీస్, మిస్టర్ ప్రవీణ్ ఉద్యోగులకు ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## సిద్దిపేటకు చేరుకున్న సద్గురు మహాదేవ్‌స్వామీజీ పాదయాత్ర

**సిద్దిపేట రూరల్, మార్చి 19, ప్రభాతవార్త :** ఆది జగద్గురు రేణుకఆచార్య జయంతి ఉత్సవాలలో భాగంగా సద్గురు మహాదేవ్ స్వామీజీ ఆధ్వర్యంలో కామారెడ్డిజిల్లా గుడిమెట్ నుంచి ప్రారంభమైన మహా పాదయాత్ర మంగళవారం సిద్దిపేటకు చేరుకుంది. మహా పాదయాత్రలో భాగంగా సిద్దిపేటలో వీరశైవ లింగ బలిజ సమాజం అధ్వర్యంలో పార్థివ కోటిలింగాల దేవాలయంలో అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సద్గురు మహాదేవ్‌స్వామిజీ ప్రవచనలు, సిద్దాంత శికామణి, పంచాచారంలు వివరించారు. మహా పాదయాత్రకు వీరశైవ లింగ బలిజ సమాజం సిద్దిపేట ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. కోటిలింగాల దేవాలయం నుంచి మహా పాదయాత్ర కొమురవెల్లికి భారీ ర్యాలీగా వెళ్లింది. మహా పాదయాత్ర యాదాద్రి జిల్లా కొలనుపాకు వరకు సాగుతుందని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో వీరశైవలింగ బలిజ సమాజం గౌరవాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరకుల్ల శివప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు అకుల భద్రప్ప, జిల్లా అధ్యక్షులు అకుల ప్రశాంత్, పట్టణ అధ్యక్షులు బావుపల్లి యాదగిరి, మాజీ అధ్యక్షులు అనుముల మల్లేశం, కార్య వర్గ సభ్యులు, భద్రయ్య, మల్లేశం, రాజ, నరకుల్ల మల్లేశం, అనుముల నాగ రాజు, బద్రి నాగరాజు, శివలింగం, గండే శ్రీనివాస్, బుక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఐనాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**కొమురవెల్లి, మార్చి 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ హై స్కూల్‌లో లైన్స్‌క్లబ్, హైదరాబాద్ ఎవరెస్ట్, లైన్స్ క్లబ్ అఫ్ అమాగల్ అధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, టుడిఈకో అలాగే కంటి పరీక్షలు, జనరల్ చెకప్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ డాక్టర్స్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, కృష్ణ, మహేష్‌కుమార్, క్లబ్ అధ్యక్షులు అరవింద్‌కుమార్, కార్యదర్శి రవీందర్, ఉమాశంకర్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, హరినారాయణ, మహేందర్ కుమార్, రఘు, స్వామిగౌడ్, రాజేందర్‌రెడ్డి, రాములు,వేణుగోపాల్, సోమసుందర్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పలుగుమీది నల్లపోచమ్మ ఆలయం ఉత్సవ కమిటీ ఎన్నిక

**హత్నూర మార్చి 19,ప్రభాతవార్త:** హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లి గ్రామం పరిధిలోని పలుగుమీది నల్ల పోచమ్మ ఆలయం ఉత్సవ కమీటిని సంగారెడ్డి జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ కమీషనర్ అనిల్ కుమార్ ప్రకటించారని నూతనంగా నియామకమైన అధ్యక్షులు కమ్మరి నర్సింహ్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులుగా శేర్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన కమ్మరి నర్సింహాచారి, సభ్యులుగా ఎస్.లక్ష్మణ్‌గౌడ్, కె.స్వరూప, కె.స్వామీ, సి.హెచ్.పొటెల్ల దశరథ, జి.శంకరయ్య, ఎం.శ్రీకాంత్‌లు (ఎక్స్ అఫిషియో) ఎన్నికయ్యారని అధ్యక్షులు తెలిపారు. ఉత్సవ కమిటీ ఏప్రిల్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు అమలులో ఉంటుంది ప్రకటనలో తెలిపారు. ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నూతన అధ్యక్షులు తెలిపారు.

## రెండవరోజు పదిపరీక్షల్లో 98.8శాతం విద్యార్థులు హాజరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 19,ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షలలో రెండవరోజు మంగళవారం జరిగిన పరీక్షలలో 99.8శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని జిల్లా విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 22017 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 21075 మంది హాజరయ్యారని,42మంది గైర్హజరయ్యారని తెలిపారు. డిఇఒ కందిమండలంలో 3కేంద్రాలను,పటాన్‌చెరువు మండలంలోని 2కేంద్రాలను పరిశీలించగా,ఫ్లైయిగ్ స్కాడ్స్ ఆఫీసర్స్ 35 కేంద్రాలను సందర్శించారని తెలిపారు.ప్రైవేటు విద్యార్థి ఒకరు హాజరు కావలసి ఉండగా అతడు హాజరుకాలేదని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలి
### మాధవానంద సరస్వతి స్వామి


భక్తులకు ప్రవచనాలు ఇస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

**కొల్చారం, మార్చి19 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని కొల్చారం మండలం రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని శివాలయం ఆవరణలో కృష్ణానంద ఆశ్రమంలో కొల్చారం గ్రామానికి చెందిన ఆరుగొండ అశోక్, లీలీ దంపతులు స్వామి వారికి పాదపూజ చేశారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు పెద్దఎత్తున పాల్గొని శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని అశోక్, లీలా దంపతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాధవానంద స్వామి శిష్య బృందం, భక్తులు, మహిళా భక్తులు తదితరులు ఉన్నారు.

## చెక్‌పోస్టులను పరిశీలించిన ఆర్డీఓ

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర సరిహద్దులోని మండలంలో ఏర్పాటు ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టులను మంగళవారం ఆర్‌డిఓ ఎస్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డితో కలిసి పరిశీలించారు. జహీరాబాద్-బీదర్ రోడ్డుపై రాష్ట్ర సరిహద్దులో మండలంలోని హుసెల్లి గ్రామ శివారులో, మండలంలోని మల్గి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం, నగదు సరఫరా కాకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.


మల్గి చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రాజు

## తొగుటలో బంగారం, వెండి చోరీ

**తొగుట, మార్చి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం అర్థరాత్రి దొంగలు తాళం వేసిన ఇండ్లను పసిగట్టి బీభత్సవం సృష్టించారు. ఇంటి తాళాలు పగలగొట్టి అదే గ్రామానికి చెందిన పాగాల రామచంద్రరెడ్డి ఇంట్లో 3 తులాల బంగారం, 10 తులాల వెండి, పయ్యావుల అనిల్ ఇంట్లో 1 తులం బంగారం, 5 తులాల వెండి దొంగిలించినట్లు ఎస్ఐ లింగం తెలిపారు. సంఘటన స్థలాలను సీఐ లతీఫ్ సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.